డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ సోషియాలజీ (ఇంటర్నల్), ఎంఏ సోషియాలజీ (నాన్ ఇంటర్నల్), డేటా సైన్స్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 24వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దూరవిద్య పీజీ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే అన్ని పీజీ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఈ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సవాల్ చేసేందుకు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 7వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఏండ్ల నాటి సమస్యలు పరిష్కరించాం

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 6: నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో నూతన రోడ్లు, పార్కులు, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి పనులను పూర్తి చేయడం ద్వారా ప్రజలు ఎన్నో ఏండ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం పద్మారావునగర్‌లోని పార్కు వద్ద రూ.12.50 లక్షలతో, వెంకటాపురం కాలనీలో రూ.42 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లు, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో రూ.3 లక్షలతో పార్కు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య, పీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు జి.పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశరాజు, నాయకులు కె.లక్ష్మీపతి, ఏసూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతా కల్యాణం

కళాకారులను సత్కరించిన మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, కేవీ రమణచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శృగేరి శంకరమఠంలో హరికథా మహోత్సవాల్లో భాగంగా గురువారం సీతా కల్యాణం హరికథా గానం పలువురుని విశేషంగా ఆకట్టుకుంది. లక్ష్మినారాయణ(భాగవతార్)చే సీతా కల్యాణం హరికథా గానం అలరించింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలాచారి పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణచారి, భవానీ దేవి, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా డివిజన్‌ను తీర్చిదిద్దుతా

ఎస్ఆర్టీలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 6: దశాబ్ద కాలంలో సనత్‌నగర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందించిన ప్రోత్సాహంతో సనత్‌నగర్‌ను అన్ని విభాగాల్లో అభివృద్ధి చేశామని కార్పొరేటర్ కొలను లక్ష్మి పేర్కొన్నారు. ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో రూ.22లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు గురువారం కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తలసాని అందించిన చేయూతతో దశాబ్ద కాలంలో డివిజన్ తిరుగులేని పురోగతి సాధించిందని అన్నారు. డివిజన్‌లోని పార్కులు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థలతో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. బీకేగూడ ఎల్ఐజీ కాలనీలో శిథిలమైన రోడ్లకు ప్యాచ్ పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ప్యాచ్‌వర్క్స్, కొత్త రోడ్ల నిర్మాణాల్లో ఎటువంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత బాల్‌రెడ్డి, సనత్‌నగర్ కాలనీకి చెందిన వివిధ పక్షాలకు చెందిన నాయకులు విష్ణు, నరేందర్‌రెడ్డి, ఆకారి శ్రీనివాస్‌రావు (మామాజీ), వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి పురస్కారాల ప్రదానోత్సవం

పురస్కారం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: తేజస్విని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో గురువారం దాశరథి పురస్కారాల ప్రదానోత్సవం, కవన తరంగ శరధి–దాశరథి సినీ సంగీత విభావరి పలువురుని అలరించింది. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని కాసర్ల శ్యామ్, కె.రామాచారి తోపాటు పలువురికి దాశరథి పురస్కారాల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ పి.విజయబాబు, సాహితీవేత్త వోలేటి పార్వతీశం, మురళీధర్‌రావు, డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి, తేజస్విని కల్చరల్ అసోసియేషన్ స్థాపకుడు ఎస్వీ సుధాకర్, కాలేరు రామోజి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను విరివిగా నిర్వహించాలి

మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: పేదల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరాలను విరివిగా నిర్వహించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదల బస్తీల్లో వైద్య శిబిరాలను నిర్వహించి మందులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కె.సురేందర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మహంకాళి ఆలయంలో కుంకుమార్చన

బేగంపేట్, ఫిబ్రవరి 6: సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో ఈ నెల 8 నుంచి కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు దేవాలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5 రోజుల పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అద్దాల మండపంలో పూజలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు మహిళా సత్సంగ్ బృందం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఓ మహిళకు సుహాసిని పూజలు నిర్వహిస్తారన్నారు. 12వ తేదీ శాంతి హోమం, పూర్ణాహుతి విశేష పూజలు ఉంటాయని తెలిపారు.

డీఎన్‌ఎంకాలనీ పీస్ కమిటీ ఆవిర్భావం

డీఎన్‌ఎంకాలనీ పీస్ కమిటీ నూతన కార్యవర్గం

అమీర్‌పేట్, ఫిబ్రవరి 6: రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి అంతా సహకరించాలని కొత్తగా ఏర్పడిన డీఎన్‌ఎంకాలనీ పీస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్ పేర్కొన్నారు. ప్రతిఒకరు కాలనీ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోవాలని, కాలనీలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. గురువారం డీఎన్‌ఎంకాలనీలో సమావేశమైన స్థానికులు కొత్తగా పీస్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ బషీరుద్దీన్ (ముజాహిద్), ఉపాధ్యక్షుడిగా మీర్జా సాలార్ బేగ్ నియమితులయ్యారు. డీఎన్‌ఎం కాలనీలో కొద్ది రోజులుగా కాలనీ సంఘానికి సంబంధించి చోటు చేసుకుంటున్న విబేధాలు స్థానికుల మధ్య అనైక్యతను చాటుతున్నాయన్నారు. కాలనీ సంక్షేమానికి ఎవరు పాటుపడ్డా వారిని పీస్ కమిటీ అభినందిస్తుందని, రాజకీయాలకు అతీతంగా స్థానికుల మధ్య చక్కటి స్నేహ పూర్వక వాతావరణం పెంపొందించేందుకు పీస్ కమిటీ కృషి చేస్తుందని అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు కాలనీవాసులు నూతన పీస్ కమిటీ ప్రతినిధులను అభినందించారు.

బీసీలను దగాచేసిన కాంగ్రెస్ సర్కార్

బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ సర్కార్ బీసీలను దగా చేసిందని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ మండిపడ్డారు. గురువారం గాంధీనగర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు సమగ్ర కులగణన పేరిట బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందన్నారు. బీసీల జనాభా ఎందుకు తగ్గిందో ప్రభుత్వం తెలుపాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలు 46 శాతానికి కుదించటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఒక వర్గాన్ని అధికంగా చూపించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్యగా మండిపడ్డారు. మొత్తం బీసీల సంఖ్య పదేండ్ల నుంచి పెరగాలి కానీ తగ్గుతుందా అని ప్రశ్నించారు. అగ్రకులాల సంఖ్యను ఎక్కువ చూపి రిజర్వేషన్లు బీసీలకు రాకుండా చేసే కుట్ర దాగుందని అన్నారు.

పద్మశాలి సంఘం గ్రేటర్ కన్వీనర్‌గా మల్లేశ్


మల్లేశ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వలకటి రాజకుమార్

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: రాష్ట్ర పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్‌గా పి.మల్లేశ్ నియమితులయ్యారు. గురువారం భోలక్‌పూర్‌లోని పద్మశాలి సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వలకటి రాజకుమార్ ఆయనకు నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు బాల్‌రాజ్, రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బింగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

8న మత్స్యకార మహిళా జాతీయ సదస్సు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6: తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో మత్స్య మహిళా జాతీయ సదస్సు, అఖిల భారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు 8, 9 తేదీల్లో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ తెలిపారు. గురువారం ఎస్వీకేలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మొదటిరోజు దేశంలోని మత్స్య మహిళా సమస్యలపై చర్చించడానికి జాతీయ సదస్సు జరుగుతుందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐటీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత హాజరవుతున్నారని తెలిపారు. మహిళా ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ బక్కి బాలమణి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోకన్వీనర్ పుష్ప, పుష్పలత, జిల్లా కోకన్వీనర్ నవనీత, లక్ష్మి, రజని పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 6: గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం నంబర్–6లో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఒంటిపై బ్లూ రంగు జీన్స్ ప్యాంట్, బ్లూ రంగు టీషర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో..

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుడిచేతిపై 'రేజు' అని పచ్చ బొట్టు ఉందని పోలీసులు వెల్లడించారు. మృతుడి ఒంటిపై గ్రీన్ కలర్ టీషర్టు, లైట్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఈ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సుల పరీక్ష తేదీలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించాలని గతంలో ప్రకటించినప్పటికీ సాంకేతిక కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలను తిరిగి వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం, పరీక్ష సమయాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

చిట్టీల పేరుతో రూ.80.85లక్షల టోకరా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): చిట్టీల పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి, రాత్రికి రాత్రి బిచాణ ఎత్తివేసిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ముషీరాబాద్‌కు చెందిన గోరెటి బొందయ్య అలియాస్ భాస్కర్ కొంత కాలంగా చిట్ ఫండ్ నిర్వహిస్తున్నాడు. రూ.5లక్షలు, రూ.10లక్షల చిట్టీల పేరుతో పలువురి నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. తొలుత చిట్టీలు కట్టిన వారికి సమయం ప్రకారం డబ్బులు చెల్లించడంతో స్థానికులకు అతడిపై నమ్మకం కలిగింది. కాగా అదే ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి శాగంటి కరుణాకర్ నిందితుడి వద్ద రూ.5లక్షల చిట్టీలు వేశాడు. 14నెలల పాటు చిట్టీ డబ్బులు చెల్లించిన బాధితుడు చీట్టీ పాడుకునేందుకు బొందయ్య ఇంటికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉండడంతో అతడి కోసం వాకబు చేయగా బిచాణ ఎత్తేసినట్లు తెలిసింది. దీంతో చిట్టీలు కట్టిన బాధితులు లబోదిబో మంటూ నిందితుడి ఇంటికి క్యూ కట్టారు. దీంతో కరుణాకర్ ఇతర బాధితులతో కలిసి నగర సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకాడమిక్ కౌన్సిల్ సమావేశం

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉస్మానియా యూనివర్శిటీ నామినీలుగా ఆచార్యులు డి.కరుణాసాగర్, డి.శ్రీరాములు, సైదా తాలత్ సుల్తానా, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, బీఎన్ శిరీష పాల్గొని కళాశాల సిలబస్, అటానమస్ పరీక్ష విధానం, సర్టిఫికెట్ కోర్సులు తదితర అంశాలపై చర్చించారు.

పాఠ్యాంశాల రూపకల్పన అధ్యాపకులకు అనివార్యం

వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: విద్యార్థులకు నాణ్యమైన పాఠ్యాంశాలను రూపకల్పన చేయడం అధ్యాపకులకు అనివార్యమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. ఇది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే సాధ్యమని చెప్పారు. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (సీఈసీ) సహకారంతో ఓయూలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసర్చ్ సెంటర్ (ఈఎంఆర్‌సీ) 'ఎంబార్కింగ్ ఆన్ డిజిటల్ ఫ్రాంటియర్: టూల్స్ ఫర్ ఎన్‌హ్యాన్సింగ్ మూక్స్ ఎక్స్‌పీరియన్స్'పై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను పీజీఆర్ఆర్‌సీడీఈ సెంటెనరీ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. మూక్స్ ద్వారా చిట్టచివరి విద్యార్థి వరకు నాణ్యమైన విద్యను అందించవచ్చని అభిప్రాయపడ్డారు. సీఈసీ, ఈఎంఆర్‌సీ అందించే కోర్సులు విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదలకు ఉపయోగపడతాయన్నారు. సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్‌భూషణ్ నడ్డా, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేశ్‌రెడ్డి, ఓయూ యూజీసీ డీన్ ప్రొఫెసర్ బి.లావణ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రఘుపతి, రాయలసీమ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.నర్సింహులు, వికెన్ డిజిటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ గణేశ్ లోకండే, క్లౌడ్ సీల్ సీఈవో పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లీ కుమారుడిపై కత్తులతో దాడి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 6 : ఇంట్లో ఉన్న తల్లి, కుమారుడిపై గుర్తు తెలియని యువకులు కత్తులతో దాడి చేశారు. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల, బాధితుల కథనం ప్రకారం.... మెట్టుగూడ కిందిబస్తీ ప్రాంతానికి చెందిన తల్లి రేణుక(55), కుమారుడు యశ్వంత్(35)లపై గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో గుర్తు తెలియని ఐదుగురు యువకులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న చిలకలగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రేణుకకు ముగ్గురు కుమారులు ఉండగా దాడికి పాల్పడిన వారు ఎవరై ఉంటారు...ఎందుకు దాడి చేసి ఉంటారనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇంటి చుట్టూ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దాడికి పాల్పడడానికి రెండు గంటల ముందు నుంచి వారు అదే ప్రాంతంలో తిరిగినట్లు తెలుస్తుంది. ఇంట్లో ఇద్దరే ఉన్నారని తెలుసుకొనే దాడికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండగా...రేణుక పరిస్థితి కొంత వరకు మెరుగ్గా ఉందని కుమారుడు వినయ్ తెలిపారు. తమకు ఎవరితోను గొడవలు లేవని, అసలు దాడి చేయాల్సినంత అవసరం ఎవరికి ఉంటుందని ఆయన చెప్పారు. దాడి విషయం తెలుసుకున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంసభ్యులను పరామర్శించారు.

ఈఎస్ఐని సొసైటీగా మార్చితే అంగీకరించం

జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 6: బీమా వైద్య సేవల శాఖను మూసివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కుట్ర పూరితంగా ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము అంగీకరించమని ఈఎస్ఐ ఉద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. గురువారం బీమావైద్య సేవల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఫ్యామిలీ వెల్ఫేర్) డాక్టర్ నీరజను కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, డాక్టర్ కల్యాణ్, ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు శీనయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీఎన్‌జీఓ ఐఎంఎస్ డైరెక్టరేట్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీరన్నగౌడ్, కార్యదర్శి నర్సింగ్‌రావు, డీఐఎంఎస్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి రాఘవేందర్, అపరంజిని, రవీందర్ మాట్లాడారు. ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు ప్రయత్నాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కమిటీలో కేవలం అనుకూలమైన ఉన్నతాధికారులు మాత్రమే ఉన్నారని, అందులో ఉద్యోగ సంఘాల నాయకులను కూడా చేర్చాలని, తమ వాదన కూడా వినిపించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీల ద్వారా 20 లక్షల మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న బీమా వైద్య సేవల శాఖను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సొసైటీ ఏర్పాటు ప్రతిపాదనతో ఈఎస్ఐ ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, మరోవైపు బీమా దారులకు అందించే సేవల్లో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, అందుకే తాము సొసైటీ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నామని వారు అన్నారు. తెలంగాణ సాధించుకొని పదేండ్లు దాటినా ఇంకా సీమాంధ్ర ఉన్నతాధికారుల పెత్తనం పోవడం లేదని, అందుకే న్యాయం కోసం 10 రోజులుగా లంచ్ అవర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

మహిళలకు ఎఫ్ఎల్ఓ చేయూత అమోఘం


ఎఫ్ఎల్‌వో గ్యాలరీని ప్రారంభించిన సుహాని షా, ప్రియ గజ్దార్ తదితరులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 6: మహిళల మనస్తత్వంలో మార్పులు తీసుకువస్తూ, వారిని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తున్న ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) కృషి అమోఘమని అగ్రశేణి మానసిక నిపుణురాలు సుహాని షా పేర్కొన్నారు. 'ది మ్యాజిక్ ఆఫ్ మెంటలిజం' పేరుతో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) గురువారం అమీర్‌పేట్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో నిర్వహించిన సదస్సు విజయవంతమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుహాని షా మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తన అసాధారణ నైపుణ్యంతో మనస్తత్వం, మైండ్ రీడింగ్ వంటి అంశాలపై చేసిన ప్రసంగం సదస్సులో మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. ఎఫ్ఎల్‌వో చైర్‌పర్సన్ ప్రియ గజ్దార్ మాట్లాడుతూ మహిళల్లో వ్యక్తిగతంగా లేదా సామూహికంగా వారిలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడంలో ఎఫ్ఎల్ఓ ఎల్లప్పుడూ ముందుంజలో ఉందన్నారు. సకల, ఎడ్యు స్కిల్, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆర్థిక అక్షరాస్యత, పొదుపు వంటి కార్యక్రమాలతో పట్టణ, గ్రామీణ మహిళలను ఆర్థిక, సామాజిక స్వావలంబన దిశగా నడిపిస్తుండడంలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషిని వివరించారు. ఈ సదస్సులో భాగంగా ఎఫ్ఎల్ఓ సాధించిన విజయాలను చాటుతూ ఏర్పాటు చేసిన గ్యాలరీలను మహిళలు ఆసక్తిగా పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 6: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ గాంధీకుటీర్, ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గాంధీకుటీర్ ఫీడర్ పరిధిలోని విఠల్‌వాడి, గాంధీకుటీర్, నారాయణ కాలేజీ, ఎయిర్ బస్ పార్టుమెంటు, శివాలయం టెంపుల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని గౌరమ్మగల్లి, సాయిబాబా కమాన్, సుందర్య పార్కు, రెడ్డి కాలేజీ, హెచ్ఆర్డీ డిగ్రీ కాలేజీ, దుర్గా మెస్ ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.